జాతరకు బైలెల్లాం

నేటి నుంచి గాజులరామారం చిత్తారమ్మ జాతర



ఆలయంలో కొలువైన చిత్తారమ్మదేవి



జాతర సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై సూచనలిస్తున్న ఏసీపీ గంగారం



చిత్తారమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సుభాష్‌నగర్: గాజుల రామారం చిత్తారమ్మ దేవి జాతర నేటి(శుక్రవారం) నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 27వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు అమ్మవారి జాతర జరగనుంది. నగరంలో ఉజ్జయిని మహంకాళి జాతర తర్వాత ఈ జాతర పెద్దది కావడం విశేషం. ఈక్రమంలో ఏర్పాట్లపై గురువారం ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్య గౌడ్ నేతృత్వంలో కమిటీ సభ్యులు నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి బాలనగర్ ఏసీపీ గంగారాం, జీడిమెట్ల సీఐ శ్రీనివాస్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జాతరలో భక్తుల రద్దీ దృష్ట్యా భద్రత విషయమై పోలీస్ అధికారులు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు.

300 మందితో భద్రత

ఏటా జాతరకు పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 300 మందితో గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఏసీపీ గంగారం తెలిపారు. ఇద్దరు ఏసీపీలు, 8 మంది సీఐలు, 25 మంది ఎస్సైలతో పాటు పోలీస్ సిబ్బంది పర్యవేక్షించనున్నారు. జాతరలో అపరిచితులు, పోకిరీలు, దొంగల కదలికపై మఫ్టీ పోలీసుల నిఘా ఉంటుందని చెప్పారు. అంతేకాకుండా ప్రత్యేకంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జాతలో భక్తులకు ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రథమ చికిత్స లాంటి సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ పేర్కొంది.

మొదటి రోజు పూజలు

మొదటి రోజు(శుక్రవారం) ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యావచనము, పంచగవ్య ప్రాశన, దీక్ష ధారణ మంటపారాధన, అగ్ని ప్రతిష్ట జరగనున్నాయి. ప్రధాన జాతర 21(ఆదివారం)న జరగనుంది. సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు బాలరాజు పెంటారెడ్డి, జి.నరసింహ, సత్తయ్య, ఇంద్రసేనారెడ్డి, ఆర్.నరసింహులు ఉన్నారు.

నియోజకవర్గానికి రుణపడి ఉంటా



ఎమ్మెల్యే వివేకానంద్‌కు హారతి పడుతున్న మహిళలు

కుత్బుల్లాపూర్: గత తొమ్మిదేళ్లల్లో తాను చేసిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని తనను మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్, చంద్రబోస్ నగర్, రోడామేస్త్రీ నగర్, ఎన్టీఆర్ నగర్, లెనిన్ నగర్, ఉమాదేవి నగర్ తదితర ప్రాంతాల్లో గురువారం ఎమ్మెల్యే కృతజ్ఞత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు స్థానికులు ఘన స్వాగతం పలకడంతో పాటు వినతిపత్రాలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం దిశగా పయనిస్తానన్నారు. బస్తీల అభివృద్ధికి స్థానిక సంక్షేమ సంఘాలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, డివిజన్ అధ్యక్షుడు విజయరాం రెడ్డి, పాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్, అంజన్‌గౌడ్, కస్తూరి బాల్‌రాజ్, అడ్వకేట్ కమలాకర్, రషీద్‌బేగ్, చిన్నా చౌదరి, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సంక్రాంతి శుభాకాంక్షలు

ఎమ్మెల్యే వివేకానంద్‌ను గురువారం తన నివాసంలో కలిసి పలువురు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పన్నులపై ఐదు శాతం రాయితీ



కమిషనర్‌కు చెక్కు అందిస్తున్న సభ్యులు

దుండిగల్: సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని వీ మాక్స్ కంటైనర్స్ పరిశ్రమ యాజమాన్యం రూ.5.30 లక్షల బకాయిలు గురువారం చెల్లించింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎర్లీ బర్డ్ పథకంలో భాగంగా ఇంటి, వాణిజ్య, పరిశ్రమల పన్నులు ముందస్తుగా చెల్లిస్తే 5 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదే విధంగా దుకాణ యజమానులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి సునంద, బిల్ కలెక్టర్లు సుజాత, భిక్షపతి ఉన్నారు.

ఆలయ స్వచ్ఛత



అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాలు, పుణ్యక్షేత్రాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో గురువారం పంచశీల కాలనీలోని నాగమ్మ ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పరుష వేణు, కమిటీ సభ్యులు రమణారెడ్డి, నాగేందర్, నరేందర్, ప్రతాపరెడ్డి. – రంగారెడ్డినగర్

దొంగల ముఠా గుట్టురట్టు



పోలీసుల అదుపులో నిందితులు రవి, భరత్, శ్రీను

నిజాంపేట్: తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తుల ముఠాను బాచుపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాచుపల్లి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. సూరారం కాలనీ సుందర్‌నగర్‌కు చెందిన కూరగాయల వ్యాపారి దేరంగుల రవి(21), అదే ప్రాంతానికి చెందిన లేబర్ పనులు చేసే దేరంగుల భరత్(20), సూరారం కాలనీ, సంతోష్‌నగర్‌కు చెందిన తన్నీరు శ్రీను(19) చెడు వ్యసనాలకు అలవాటు పట్టారు. ఈక్రమంలో డబ్బుల కోసం ముఠాగా ఏర్పడి రాత్రిళ్లు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడున్నారు. బాచుపల్లి పీఎస్ పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడిన వీరు తప్పించుకు తిరుగుతున్నారు. ఏ1గా ఉన్న రవి సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్‌ల పరిధిలో 23 దొంగతనాలు, ఏ2గా ఉన్న భరత్ సైబరాబాద్ పరిధిలో 15 దొంగతనాలు, ఏ3గా ఉన్న శ్రీనుపై మూడు దొంగతనాలు, ఒక హత్య కేసు, ఒక పోస్కో, ఒక ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదై ఉన్నాయి. వీరి కదలికలపై నిఘా పెట్టిన బాచుపల్లి పోలీసులు డీఎస్ఐ యాదగిరి నేతృత్వంలో గురువారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో సూరారంలో నిందితులను అదుపులోకి తీసుకుని బాచుపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమదైన శైలిలో పోలీసులు విచారించగా నిందితులు తాము చేసిన దొంగతనాలను అంగీకరించారు. వారి వద్ద నుండి 2 తులాల బంగారు ఆభరణాలు, 35 తులాల వెండి వస్తువులు, రూ.1.50 లక్షల నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. దొంగతనాలకు పాల్పడిన సొత్తుతో నిందితులు జల్సాలు చేసేవారని, కొంత మొత్తాన్ని ఏ1గా ఉన్న రవి వద్ద ఉంచుకున్నాడని పోలీసులు పేర్కొన్నారు. కరుడుగట్టిన నిందితులను పట్టుకోవడం కీలకంగా వ్యవహరించిన డీఎస్ఐ యాదగిరి, సిబ్బందిని పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ప్రగతినగర్ ఏఈ సమ్మయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ డాక్టర్స్ కాలనీ కేబుల్ ఫీడర్ పరిధిలోని నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, బాప్టిస్ట్ చర్చి, తిరుమల ఫర్నిచర్, జుడో మాల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ ఉండదు.

నిజాంపేట్ పరిధిలో..

విద్యుత్ ఫీడర్ల నిర్వహణలో భాగంగా 11 కేవీ కేఎస్ఆర్ ఫీడర్ పరిధిలో కేఎస్ఆర్ కాలనీ, గాయత్రి టవర్స్, డీమార్ట్ ప్రాంతాల్లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని నిజాంపేట్ సెక్షన్ ఏఈ తెలిపారు.

శంషీగూడ పరిధిలో..

సుభాష్‌నగర్: 33/11 కేవీ శంషీగూడ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మెయింటనెన్స్ నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గాజులరామారం ఏఈ చైతన్య భార్గవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు షిరిడీ హిల్స్, కైలాష్ హిల్స్, మహదేవపురం, బాలయ్య బస్తీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

అన్నదానం

మియాపూర్: మియాపూర్ హుడా మయూరినగర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వి.జగదీశ్వర్‌గౌడ్, కూకట్‌పల్లి ఇన్‌చార్జీ బండి రమేశ్, సిర్పూర్ కాగజ్‌నగర్ ఇంచార్జీ శ్రీనివాస్‌లు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంను ప్రారంభించి అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి సహకరించండి



భట్టి విక్రమార్కను కలిసిన దళిత సంఘాల నేతలు

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపాలిటీ దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాహుల్ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. దుండిగల్–గండిమైసమ్మ మండల పరిధిలో పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న 121 సర్వే నంబరు ప్రభుత్వ భూమిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన నిర్మాణానికి రెండు వేల గజాలు కేటాయించాలని ఈ సందర్భంగా కోరారు. ఇందుకు ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని సంఘం నాయకులు తెలిపారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో సల్మాన్ రాజు, ప్రభాకర్ తదితరులున్నారు.

18 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవాలి

శేరిలింగంపల్లి సర్కిల్ డీసీ రజనీకాంత్‌రెడ్డి



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన డీసీ రజనీకాంత్‌రెడ్డి

శేరిలింగంపల్లి: 18 ఏళ్ళు నిండిన వారంతా ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలని శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి సూచించారు. గురువారం జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్ళు నిండిన వారంతా విధిగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని ఓటరుగా నమోదు కావాలన్నారు. ఓటరు నమోదుతోపాటు ఏమైనా తప్పొప్పులు కూడా ఉంటే సరిదిద్దడానికి ఆన్‌లైన్ ద్వారానే చేయించుకోవాలన్నారు. ఓటరుగా మరో ప్రాంతానికి మార్పు చేసుకోవడానికి ఆన్‌లైన్ ద్వారానే చేసుకునేలా చూడాలన్నారు. తప్పొప్పుల సవరణ, ఓటరు నమోదు, ప్రాంతం మార్పు వంటి అంశాల కోసం శనివారం, ఆదివారం అన్ని పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక క్యాంప్‌ను ఏర్పాటు చేసి అక్కడ ఓటరు జాబితాను అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. ఈ జాబితాను పరిశీలించి తప్పొప్పులుంటే ఆన్‌లైన్ ద్వారా సరి చేసుకోవాలని సూచించారు.

ఓటుహక్కుపై అవగాహన

జిన్నారం(పటాన్‌చెరు): అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేయించుకోవటంతో పాటు ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని జిన్నారం తహశీల్దార్ రవికుమార్ సూచించారు. జిన్నారం మండలంలోని ఖాజీపల్లి పారిశ్రామికవాడలో గురువారం కార్మికులు, ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని రెవెన్యూ అధికారులు నిర్వహించారు. తహశీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ అర్హులైన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా తమను సంప్రదించాలన్నారు. ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

షాపింగ్‌కు వెళ్లిన ఇద్దరు యువతులు అదృశ్యం



అదృశ్యమైన సంతోషిణి, వైష్ణవి(ఫైల్)

గచ్చిబౌలి: షాపింగ్ చేసేందుకు వెళ్లిన ఇద్దరు యువతులు అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ సాయిలు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గౌలిదొడ్డిలో నివాసం ఉండె బాజారావు మహదేవ్ కూతురు సంతోషిణి(24)కి సంవత్సరం క్రితం బీదర్‌కు చెందిన అర్జున్‌తో వివాహం జరిగింది. సంతోషిణి ఆరు రోజుల క్రితం సంక్రాంతి పండుగ కోసం తల్లిగారింటికి వచ్చింది. మహదేవ్‌కు కోడలు వరుస అయ్యే యువతి ఏ.వైష్ణవి(22)తో 8 నెలల క్రితం కార్వాన్‌కు చెందిన గణేష్‌తో వివాహం జరిగింది. సంతోషిణి, వైష్ణవి షాపింగ్ చేసేందుకు కోఠి వెళుతున్నామని చెప్పి 17న మధ్యాహ్నం 12 గంటలకు ఓ ఆటోలో ఇంటి నుంచి వెళ్లారు. సాయంత్రమైన తిరిగి రాకపోవడంతో ఫోన్ చేయగా ఇద్దరి సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఉన్నాయి. రాత్రైనా తిరిగి రాకపోవడంతో మహదేవ్ గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. యువతుల కోసం గాలిస్తే సుల్తాన్ బజార్‌లో ఆటో దిగినట్లు గుర్తించినప్పటికీ వారి ఆచూకీ మాత్రం లభ్యం కాలేదు. పెళ్లైన యువతులు ఎక్కడికి వెళ్లారో అర్థం కావడం లేదని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అయోధ్యకు పట్టు వస్త్రాలు పంపిన సగర సంఘం



గచ్చిబౌలి: అయోధ్యకు తెలంగాణ సగర సంఘం రాష్ట్ర కమిటీ పట్టు వస్త్రాలను పంపింది.తెలంగాణ సగర యువజన సంఘం అధ్యక్షుడు మర్క సురేష్ ద్వారా ఈ పట్టు వస్త్రాలను పంపించారు. గురువారం గచ్చిబౌలిలోని రాష్ట్ర సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు ఉప్పరి శేఖర్, ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలకు ప్రత్యేక పూజలు చేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సగర సంఘం నాయకులు అంజనేయులు, శ్రీనివాస్, శేఖర్, వేణుగోపాల్, దాయోదర్, కేపీరాములు, భీమయ్య, రవి, రామస్వామి పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

గణతంత్ర వేడుకల సమీక్ష సమావేశంలో కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: కలెక్టరేట్‌లో ఈనెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వేడుకల్లో జాతీయ భావం ఉట్టిపడేలా ఘనంగా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. జాతీయ పతాకావిష్కరణ, పోలీసు గౌరవ వందనం కార్యక్రమాలను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాలని తెలిపారు.

కలెక్టరేట్ ఆవరణలో పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం నిర్వహణ విషయాలపై సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు అవసరమైన సూచనలు చేశారు. జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో వేదికను అందంగా అలంకరించాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, ముఖ్య అతిథులకు గణతంత్ర దినోత్సవ ఆహ్వానపత్రాలను అందచేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించే కార్యక్రమాలను రెవెన్యూ శాఖ పర్యవేక్షించాలన్నారు. జిల్లా ప్రగతి పై రూపొందించే నివేదిక సీపీవో ఆధ్వర్యంలో తయారు చేయాలన్నారు. జాతీయ భావం ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ అధికారులు చేపట్టాలన్నారు.

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యశాఖ అధికారులు, సిబ్బందితో పాటు అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో విద్యుత్తు సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు ఇప్పటి నుంచే మరమ్మతులు చేసుకోవాలన్నారు. స్వాతంత్ర్య సమర యోధులను ఆహ్వానించి వారికి ఆతిథ్యం అందించాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఆర్డీవోలు రాజేష్ కుమార్, శ్యామ్ ప్రకాశ్, కలెక్టరేట్ ఏవో రామ్మోహన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్సీకి వినతి



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన మహిళలు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు గురువారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలు అందించారు. దీనిపై స్పందించిన శంభీపూర్ రాజు సంబంధిత అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. అదే విధంగా పలు సంఘాల నేతలు ఎమ్మెల్సీని సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

యూనియన్ బ్యాంక్ శాఖ ఏర్పాటు చేయాలి



రజనీకాంత్‌కు వినతిపత్రం ఇస్తున్న భరత్‌గౌడ్

జగద్గిరిగుట్ట: డివిజన్‌లో యూనియన్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని టీపీసీసీ రాష్ట్ర జాయింట్ కో–ఆర్డినేటర్(ఓబీసీ డిపార్ట్‌మెంట్) గడ్డమీది భరత్ గౌడ్ గురువారం బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ యూవీ రజనీకాంత్‌కు వినతి పత్రం ఇచ్చారు. సుమారు లక్షకు పైగా జనాభా ఉన్న జగద్గిరిగుట్ట డివిజన్‌లో ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. తమ వినతికి డీజీఎమ్ రజనీకాంత్ సానుకూలంగా స్పందించినట్లు భరత్ తెలిపారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ మండల మైనార్టీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.వనిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్‌లోని సీఈసీ, ఎంఈసీ విభాగాల్లో చేరేందుకు మైనార్టీ, నాన్ మైనార్టీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. అదే విధంగా 6, 7, 8వ తరగతుల్లో చేరే విద్యార్థుల నుంచి సైతం దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. 5వ తరగతిలో ముందుగా వచ్చిన విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామని, ఇతరులకు లక్కీ డ్రా నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని, నేరుగా పాఠశాలకు వచ్చి అప్లై చేయాలన్నారు. లేదంటే ఆన్‌లైన్‌లో https://tmreistelangana.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని వనిత సూచించారు. ఇతర వివరాలకు 73311 70803/95531 58618 నంబర్లలో సంప్రదించవచ్చు.

పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు



వెంకట్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న భూపతిరెడ్డి

దుండిగల్: కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసేవారికి ఎప్పుడూ గుర్తింపు లభిస్తుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థులుగా మహేశ్‌కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్‌ను ఏఐసీసీ నిర్ణయించిన విషయం తెలిసిందే. నాయకులను భూపతి రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారితో కలిసి నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి వెంకట్‌ని కలిసిన జాన్

చింతల్: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకట్‌ను గురువారం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి బీఆర్ఎస్ పార్టీ నిరుద్యోగులు, విద్యార్థులను మోసం చేసిందని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలపై ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో పోలీసుల లాఠీల దెబ్బలను సైతం లెక్క చేయకుండా పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. ఎన్ఎస్‌యూఐ పోరాట స్ఫూర్తిని గుర్తించిన కాంగ్రెస్ అధిష్టానం వెంకట్‌కు సముచిత ప్రాధాన్యత ఇచ్చిందన్నారు.

ఫుట్‌పాత్‌లపై ఉన్న షాపుల తొలగింపు



సుభాష్‌నగర్: ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్న చిరు వ్యాపారులపై జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. గురువారం జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా కలిసి ఫుట్‌పాత్‌లకు ఇరువైపులా వెలసిన పదుల సంఖ్యలో దుకాణాలను తొలగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. సైబరాబాద్ సీపీ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. నర్సాపూర్ రాష్ట్ర రహదారిలో ఐడీపీఎల్ మొదలుకొని సూరారం, గాజులరామారం వరకు ఫుట్‌పాత్‌లపై ఉన్న షాపులను తొలగించామన్నారు.

స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

కుత్బుల్లాపూర్: గాజులరామారం డివిజన్‌లో కుత్బుల్లాపూర్ ముస్లిం మేనేజ్‌మెంట్ స్కూల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 3వ మౌలానా ఆజాద్ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్‌ను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పిల్లలు తమకు ఇష్టమైన క్రీడా సాధన చేయాలని సూచించారు. క్రీడలతో శారీరకంగా, మానసికంగా, దృఢంగా తయారవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, పాక్స్ డైరెక్టర్ పరిశె శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్, అడ్వకేట్ కమలాకర్, హజ్రత్ అలీ, మూసా ఖాన్, చిన్నా చౌదరి, వహీద్, అధ్యక్షుడు అల్తాఫ్ హుస్సేన్ తదితరులున్నారు.

వార్షికోత్సవానికి ఆహ్వానం



మేయర్‌కి ఆహ్వానపత్రిక ఇస్తున్న స్కూల్ యాజమాన్యం

నిజాంపేట్: విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత పాఠశాలల యాజమాన్యాలపై ఉందని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. కిడ్స్ ఆర్ కిడ్స్ స్కూల్ 18వ వార్షికోత్సవ వేడుకలకు రావాల్సిందిగా కోరుతూ పాఠశాల యాజమాన్యం మేయర్‌ను ఆమె నివాసంలో గురువారం కలిసి ఆహ్వాన పత్రిక అందించారు.